# న్యాయానికి మరో నిర్వచనం

'మోహిని'



సూర్యుడు నడినెత్తిన గెజిటెడ్ ఆఫీసరులా మండిపడుతున్నాడు.

దొరతనంవారి నిర్లక్ష్యానికి బలైపోతున్న ఆఫీసు ఫైళ్ళకుమల్లె రోడ్డు ఎండకి తగలడిపోతూంది.

అధికారానికి తలవంచే పేద గుమాస్తాలు లాగా కొందరు రోడ్డుప్రక్కగా తలవంచుకుని నడుస్తున్నారు.

ఆఫీసరు బావమరిదిలా కొందరు నిర్లక్ష్యంగా కారుల్లో దూసుకు పోతున్నారు.

సినిమా హోర్డింగ్‌కీ నీడని ఆసరా చేసుకుని చంద్రిగాడు దిగులుగా నుంచున్నాడు.

వాల్‌పోష్టరులోలా తనూ ఓ అందమైన అమ్మాయిని కౌగిలిలో బిగించుకోలేకపోయినందుకు దిగులు చెందటం లేదు.

ఎదురుగా నిలబడ్డ నాలుగంతస్తుల భవనం తనది కాకపోయినందుకూ చంద్రిగాడు బాధపడటంలేదు.

తన కోరిక వీటన్నిటికంటె అతీతమైంది.

అత్యల్పమైంది.

అతి సాధారణమైనది.

తనిప్పుడు అర్జంటుగా ఒక రొట్టి తిని టీ తాగితే కానీ ప్రాణం నిలిచేలాలేదు.

తను పూర్తిగా భోజనంచేసి రెండు

రోజులు అయింది. నిన్నంతా టీ నీళ్ళతోనే గడిపాడు. ఇవాళ ఇంతవరకు ఆ టీ నీళ్ళుకూడా ప్రాప్తించలేదు.

రాత్రి అంతా ఆకలితో నిద్రపట్టలేదు.

అయినా, వుదయంలేని వుత్సాహం తెచ్చుకుని రోడ్డునపడ్డాడు.

అసలే ఆదివారం.

దానికితోడు ఈ మండించే ఎండలు.

జనం అసలు బయటకు రావటం లేదు.

రోడ్డుమీద జనం తిరుగుతుంటే తనకి ఏదో గిరాకీ దొరికివుండేది.

అప్పటికీ తను ఓపికతో నాలుగు రోడ్లు పిచ్చిఎక్కినట్లు తిరిగాడు.

గంటక్రితం ఓ గిరాకీ తగిలింది.

ఎక్కడో ఏదో ఫంక్షను జరుగుతూంది. అక్కడికి ఇన్ని షామియానాలు, బొంగులు, తాళ్ళు, చెత్తాచెదారం ఇంత లోడూ నడుం పడిపోయేలా తీసుకువెళ్తే రెండున్నర వచ్చింది.

అప్పటి నుంచి మళ్ళీ గిరాకీ లేదు.

కడుపులో పేగులు అరుస్తున్నాయి.

గొంతు ఎండుకుపోయింది.

ఎదురుగావున్న ఇరానీ హోటలులో ఇప్పటికే రెండుసార్లు మంచినీళ్ళు తాగి వచ్చాడు. కానీ దాహం తీరలేదు. ఇది మంచినీళ్ళతో తీరే దాహం కాదు. ఇది ఆకలిదాహం. దీనికి విరుగుడు అన్నం లేదా బన్‌రొట్టి, ఇంత టీ.

చంద్రిగాడు జేబులో చెయ్యి పెట్టాడు.

చేతికి అందినవి బయటకు తీసి రెండవ అరచేతిలో పోసుకుని లెక్కపెట్టటం మొదలుపెట్టాడు.

రెండు రూపాయి నోట్లు, ఒక పావలా బిళ్ళ, ఒక పదిపైసలుబిళ్ళ, మూడు అయిదు పైసల నాణాలు. మొత్తం రెండున్నర రూపాయిలు.

ఇంకొకసారి లెక్కపెట్టాడు-

అంతే వుంది.

ఇప్పటికి ఇలా లెక్కపెట్టటం ఏ పదో సారో.

ఎన్నిసార్లు చూసినా ఆ రెండున్నర అలాగే వుంది.

ఒక్క పైసాకూడా పెరగలేదు.

రెండున్నరకు మించి ఏ మాత్రం వున్నా చంద్రిగాడు హోటలులో దూరిపోయి వుండేవాడు.

ఈ రెండున్నర మీద తనకిఎంత మాత్రం అధికారం లేదు. తను అన్నం లేకుండా ఎన్నాళ్ళు అయినా వుండగలడు. కానీ ఈ రెండున్నరలో ఒక్క పైసాకూడా ఖర్చుపెట్టలేడు.

కారణం ఆ డబ్బు అలాగే తీసుకువెళ్ళి రిక్షా కిరాయి చెల్లించాలి. పైసా తగ్గిందంటే మరునాడు రిక్షా ఇవ్వడు యజమాని.

ఇవాళ కాకపోతే రేపు అయినా తనకి గిరాకీ తగిలి మరో రూపాయి సంపాదించలేకపోడు.

వెధవది ఆకలికి అంతు ఎక్కడిది.

ఎంతతిన్నా కొంత సేపటికిమళ్ళీ ఆకలి. అసలు ఈ ఆకలిమంటే లేకపోతే తను మహారాజులా దర్జాగా వుండేవాడు.

ఇంత ఆకలిని పెట్టి దాన్ని తీర్చుకునే అవకాశం లేకుండా చేసిన భగవంతుడి మీద చంద్రిగాడు పళ్ళునూరుకున్నాడు.

చంద్రిగాడు గతంలో రెండుసార్లు ఇలాగే భగవంతుడిమీద పళ్ళు నూరు కున్నాడు.

కానీ అప్పటి సందర్భాలు వేరు.

అప్పట్లో చంద్రిగాడి వయసు పదేళ్ళు వుంటుంది. ఒకరోజున తను స్కూలు నుంచి వచ్చేసరికి ఇంటిముందు జనం గుమిగూడి వున్నారు. అందరి మధ్య కూర్చుని తన తల్లి తలబాదుకుంటూ ఏడుస్తూంది.

"వురేయి చంద్రిగా. మీ నాయన లారీని చెట్టుకి గుద్దించి సచ్చాడురోయ్" అంటూ ఎవరో చెప్పారు.

ఆ వయసులో ఎక్కువ అర్థంకాక పోయినా దేముడి మీద పళ్ళు నూరు కున్నాడు.

అది జరిగిన కొన్నిరోజులకి ఒక సారి తను ఉదయమే నిద్రలేచేసరికి ఇంట్లో అమ్మ కనపడలేదు. ఏదో పనిలో వుందనుకున్నాడు. మధ్యాహ్నం అయినా కనపడలేదు. అప్పుడు ఏడుపు ముఖంతో ప్రక్క గుడిసెలో వాళ్ళని "మా అమ్మ కనిపించిందా" అని అడి గాడు.

"ఇంకా అమ్మేంటిరా ఎదవా! అది మస్తాన్‌గాడితో లేచి పోయింది గా" అన్నాడు ఒకడు.

అందుకు మిగిలినవాళ్ళు పెద్దగా నవ్వుతుంటే చంద్రిగాడికి వాళ్ళమీద కంటె ముందు భగవంతుడి మీద కోపం వచ్చి— పళ్ళు నూరుకున్నాడు.

తల్లిదండ్రులచే అలా వదిలివేయ బడ్డ చంద్రిగాడు రోడ్డున పడ్డాడు.

ఆ రోడ్డునే నమ్ముకున్నాడు.

రోడ్డుమీద నడిచిపోయేవాళ్ళ నుంచి డబ్బులు అడుక్కోవటం మొదలు పెట్టాడు.

దొరికిన డబ్బులుతో ఇరానీ హోట లులో కొనుక్కుని తినేవాడు.

ఇలా రోడ్డుమీద పోయేవాళ్ళ వెంట బడి కాళ్ళు అరిగిపోయేలా తిరిగే కంటే ఒకచోట స్థిరనివాసం ఏర్పరచుకోవటం మంచిదనుకున్నాడు.

తను కొనుక్కుతినే ఇరానీ హోటలు ముందు నుంచుని బయటకు వచ్చేవాళ్ళ ముందు దీనంగా మొహంపెట్టి డబ్బులు అడుక్కోవటం మొదలుపెట్టాడు.

అలా హోటలు ముందు అడుక్కునే వారు ఎంతమందో. అందరిలో చంద్రి గాడు ఒకడు. వీళ్ళంతా కలిసి పెద్ద "న్యూసెన్సు"గా తయారు అయ్యారని హోటలు యజమాని అభిప్రాయపడి అందరినీ తరిమేసాడు— చంద్రిగాడిని తప్ప.

చంద్రిగాడిని పిలిచి— "హోటలులో పనిచేస్తావురా" అని అడిగాడు.

హోటలులో వుండే తిండికి లోటుండదనే సత్యం గ్రహించినవాడై ఆరోజే పనిలో చేరిపోయాడు.

కానీ చంద్రిగాడికి తన ఉద్దేశ్యం నెరవేరలేదు.

వుదయం అయిదు గంటల నుంచి రాత్రి పన్నెండు దాటేవరకూ నిర్విరామంగా ఆ హోటలు పనిచేస్తుంది. చంద్రిగాడు బల్లలు తుడవటం, గ్లాసులు తీయటం, నీళ్ళుపెట్టటం లాంటి పనులు చెయ్యాలి.

ఎంతచేసినా మెప్పులేదు.

చేయిజారి గ్లాసు పగిలితే, యజమాని తన వీపు పగల కొట్టేవాడు.

ఇక తిండి విషయం వస్తే, కడుపు నిండా ఇంత అన్నం దొరికేదికాదు. మిగిలిపోయిన ఎండురొట్టె ముక్కలు తినటానికి ఇచ్చేవారు. ఆకలి చావక ఏవైనా అందుకుని తింటే, యజమాని చావుదెబ్బలు కొట్టేవాడు.

అలా కొంతకాలం గడిచింది.

ఈ మధ్యకాలంలో చంద్రిగాడు హోటలుపనిలో ప్రమోషన్ పొందాడు.

కిచెన్‌లో టీ కలిపే పనికి మారాడు.

హాలులో— "ఏక్ చాయ్, దో చాయ్" అంటూ అరిచే అరుపులు విని, మొత్తం ఎన్నో గుణించుకుని టీ కలిపి కిటికీలో సిద్ధంగా వుంచాలి.

అలా చాయ్ కలిపే పనిలో క్షణం తీరిక వుండేదికాదు. టీ కలుపుతూనే అటు టీ డికాషను ఇటు పాలు చూసుకోవాలి.

కిచెన్ మరీ చిన్నదిగా వుండేది. మసలటానికి చోటుండదు. అందులో బాయిలర్ వేడికి తన వళ్ళుకూడా కాలుతూవుండేది. రాక్షసిబొగ్గుల పొగకి కళ్ళు మండుతూ వుండేవి. ఆ బాధలో, ఆ మంటల్లో లెక్క అంతు పట్టక, ఇన్ని కప్పుల టీ కలిపివుంచితే ఒక్కోసారి అవి మిగిలిపోయేయి. అదిచూసి యజమాని కోపగించుకునేవాడు.

వీటన్నిటికీ తోడూ ఆ వేడికి, ఆ పొగకి తన ఆరోగ్యం పూర్తిగా చెడిపోయింది. ఇది అని చెప్పలేని బాధ శరీరంలో ప్రవేశించింది.

ఆ హోటలులో పనిమానేసి మరో పనికోసం వెతకటం మొదలుపెట్టాడు.

పని దొరకలేదు.

మళ్ళీ డొక్క ఎండటం మొదలు పెట్టింది.

ప్రయత్నం తీవ్రం చేయగా రిక్షా అద్దెకు దొరికింది.

అప్పటినుంచీ, చంద్రిగాడు రిక్షా తొక్కి పొట్టపోసుకుంటున్నాడు.

చంద్రిగాడికి వెనకాముందూ ఎవరూ లేరు.

ఒంటిగాడు.

ఒక్క పొట్ట.

ఆ ఒక్కపొట్ట నింపుకోవటం ప్రతి రోజూ ఓ బ్రహ్మప్రళయం.

అసలు నగరంలో రిక్షాలు ఎక్కువ అయిపోయాయి. వాటికిపోటీగా ఆటోలు.

వెళితే అటు సిటీబస్సులో వెళ్తారు: లేదా ఆటోనైనా పిలుస్తారు. కానీ రిక్షా ఎక్కేవారు చాలా తక్కువ.

అప్పటికీ చంద్రిగాడు తనంతట తానే "కహా జానా సాబ్" అంటూ సలకరిస్తూంటాడు.

ఎంతచేసినా రోజుమొత్తంలో తను సంపాదించగలిగేది చాలా తక్కువ. రిక్షా కిరాయికి పోను, తను కడుపునిండా రెండు పూటలా తినాలంటే మరోజన్మ ఎత్తాలని చంద్రిగాడికి ఏనాడో తెలిసిపోయింది.

చంద్రిగాడికి ఆకలిమంట పెరుగుతున్నకొద్దీ, గిరాకీ దొరుకుతుందన్న ఆశకూడా పెరగసాగింది.

ఆ ఆశతోనే వుత్సాహం తెచ్చుకుని భుజంమీది మురికి తువ్వాలుతో రిక్షాలో లేనిదుమ్మును తుడిచాడు. సీటు సర్ది మళ్ళీ పెట్టాడు. టాప్‌వేసాడు. మళ్ళీ అంతలోనే టాప్ దించేసాడు. రిక్షాచుట్టూ తిరిగి చక్రాలలోని గాలిని అంచనా వేసుకున్నాడు.

నిముషాలు గడుస్తున్నకొలదీ శరీరంలో బలహీనత పెరిగిపోసాగింది. కాళ్ళు వణుకుతున్నాయి. కొంతు ఎండిపోయింది.తనకిప్పుడుపడుకోవాలనివుంది.

కానీ పడుకోకూడదు.

ఆకలి నీరసంలో ఇట్టే నిద్రవచ్చేలా వుంది.

కానీ తనకి తిండి కావాలి.

తిండిదొరకాలంటే డబ్బులుకావాలి. డబ్బు రావాలంటే గిరాకీ దొరకాలి.

ఇంతలో ఇద్దరు యువకులు ఎదురుగా వున్న ఆ నాలుగు అంతస్తుల భవనం మెట్లుదిగి తిన్నగా చంద్రిగాడి రిక్షా దగ్గరకు వచ్చారు.

"ఏయ్ రిక్షా! వస్తావా"

"ఎక్కడికి వెళ్ళాలి బాబూ"

"రాజహంస హోటలుకి"

"రండి కూర్చోండి" అంటూ కండువాతో మరోసారి సీటుకి లేనిదుమ్ము దులిపాడు.


"ఎంత కావాలి"

"మీ దయబాబూ" అన్నాడు చంద్రిగాడు.

వాళ్ళు ఎంత ఇచ్చినా మహాప్రసాదమే తనకిప్పుడు. ఇంతకావాలని అడగకూడదు.

"దయేమిటోయి. వెధవ డిప్లొమసీ మీరూనూ. ముందు ఇంతని చెప్పక, తరువాత ఎక్కువ కావాలని పేచీకి దిగటం మీకు అలవాటేగా"_ ఆ యువకుడు చిరాకుపడిపోతున్నాడు.

అసలు రిక్షా కావాలని రావటమే గొప్ప. మామూలు పరిస్థితులలో అయితే రెండు రూపాయిలు అడగవచ్చు. కానీ ఇప్పుడు రెండురూపాయిలు అడిగితే వాళ్ళు వెళ్ళిపోతారేమో. అంతేకాక ఇప్పుడు ఆటోలు అందుబాటులో లేక తన రిక్షాకోసం వచ్చారు కానీ ఏ క్షణంలోనైనా ఆటో ఇటుగావస్తే, తనని వదిలి



అందులో వెళ్ళిపోతారు. కాబట్టి తను తెలివిగా ఈ బేరం చేజిక్కించుకోవా లనుకున్నాడు చంద్రిగాడు.

అటూ ఇటూగా కుండా మధ్యస్థంగా "రూపాయిన్నర ఇవ్వండి" అన్నాడు.

మారు మాట్లాడకుండా ఎక్కికూర్చు న్నారు వాళ్ళు.

రాజంహంస హోటలు బషీర్‌బాగ్ చౌరస్తాలో వుంది. తను ఎన్నోసార్లు ఆ హోటలుకు ఎంతోమందిని చేరవేసాడు.

ఆ హోటలులో భోజనం ఒక పూటకి పాతిక రూపాయిలు అవుతుందట. ఎన్నో వంటకాలతో ఎంతో రుచిగా వుంటుందని తన తోటివాళ్ళు అను కుంటూవుండగా విన్నాడు.

చంద్రిగాడు కూడా ఏనాటికైనా ఆ హోటల్లో ఒకసారి భోజనం చేయాలని కుతూహలపడ్డాడు. అయితే పాతిక రూపాయిలు ఒక్కసారిగా తన వద్ద ఎన్నడూ పోగవలేదు.

ఇప్పుడు రిక్షాలో కూర్చున్న యువ కులు ఆ హోటలులో భోజనానికి వెళు తున్నట్టున్నారు. అదృష్టవంతులు అను కున్నాడు చంద్రిగాడు.

రిక్షా బ్యాంక్‌స్ట్రీట్ దాటి ట్రూప్ బజారులో నడుస్తూంది.

చంద్రిగాడు తన శక్తినంతా కూడా దీసుకుని రిక్షా తొక్కుతున్నాడు. పళ్ళ బిగువున ఎంత బలం ప్రయోగించినా, రిక్షా ముందుకి సాగటంలేదు.

అసలే రోడ్డు ఎత్తుగా వుంది.

చంద్రిగాడు రిక్షా దిగి లాగటం మొదలు పెట్టాడు.

రోడ్డు మీద కాళ్ళు కాలుతున్నాయి,

డొక్కలో ఆకలి మండుతూంది.

తలమీద జుట్టులో చెమటపట్టింది.

పట్టిన చెమట ధారలుగా మొహం మీద కారుతోంది.

గొంతు ఎండిపోయి శ్వాస ఆడటం కష్టంగా వుంది. నోరు తెరిచి రొప్పుతుంటే చెమటబొట్లు నోట్లోకి జారి వుప్పగా తగులుతున్నాయి.

వీపుమీద పాతచొక్కా ఎప్పుడో తడిచిపోయి వంటికి అతుక్కుపోయింది.

అంతటి నీరసంలో కూడా చంద్రిగాడు వుత్సాహంగానే వున్నాడు. ఇంకా ఒక ఫర్లాంగు దూరం లాగితే, ఆ తరువాత రోడ్డు పల్లంగా వుంది. అప్పుడు రిక్షా తొక్కకుండానే కొంతదూరం పరుగెడు తుంది. ఇప్పుడు పడ్డ కష్టానికి అప్పుడు కొంత హాయి.

కష్టపడితేనే సుఖం మరి.

చంద్రిగాడు రిక్షాని గబ్బెక్కిం చేసాడు.

"త్వరగా పోనీ" అంటూ రిక్షాలో యువకుడు తొందరపెట్టసాగాడు.

"అయిపోయింది బాబూ" అంటూ హుషారుగా చంద్రిగాడు పెడల్‌మీద కాలువేసి ఎగిరి సీటుమీద కూర్చున్నాడు.

ఇప్పుడు రిక్షా తొక్కకుండానే పల్లంలో జారిపోతూంది.

రిక్షా వేగానికి చెమటకి తడిసిన మొహంమీదకి గాలివీస్తుంటే ప్రాణానికి హాయిగా వుంది.

మరో పదినిముషాలలో రిక్షా రాజ్ హంస హోటలు చేరుకుంటుంది.

వాళ్ళిచ్చే రూపాయిన్నరతో ఇంత కూడు తినాలి అనుకున్నాడు చంద్రిగాడు.

కానీ చంద్రిగాడు అనుకున్నది అను కున్నట్టుగా తన జీవితంలో ఎన్నడూ జరగలేదు.

ఇంతలో గ్రామర్ స్కూల్ ముందున్న సందులోంచి దూసుకుంటూ ఓ ఆటో మెయిన్ రోడ్డుమీదకి వచ్చింది.

వచ్చింది వచ్చినట్టుగా రిక్షాని ఢీకొని అంతదూరం వెళ్ళి ఆగింది.

రిక్షా ముందుచక్రం వంకరపోయింది.

రిక్షా ఒక ప్రక్కకి ఒరిగిపోయింది.

చంద్రిగాడు సీటుమీదనుంచి ఎగిరి అంతదూరంలో రోడ్డుమీద పడ్డాడు.

రిక్షాలో కూర్చున్న యువకులు చెరో వైపుకి పడిపోయారు.


అదృష్టవశాత్తు ఎవరికీ దెబ్బలు తగలలేదు.

ముగ్గురూ లేచి నిలబడ్డారు.

యువకులు బట్టలు దులుపుకుంటూ ప్రక్కనేవున్న షాపు నీడని చేరు కున్నారు.

నడిరోడ్డుమీద రిక్షా పడివుంది.

ఇంతలో ఆటో డ్రైవరువచ్చి చంద్రి గాడిని కొట్టినంత పనిచేసాడు. తప్పంతా నీదేనన్నాడు. ఇంకా ఏదో అన్నాడు. బండబూతులు తిట్టి, మరుక్షణం ఆటో తీసుకుని వెళ్ళిపోయాడు.




చంద్రిగాడికి ఇవేవీ వినపడలేదు.

అతనిప్పుడు వినగలిగే స్థితిలో లేడు.

అంతకు ముందున్న ఉత్సాహం అంతా అంతరించిపోయింది.

లేచి రిక్షాని చేరుకున్నాడు.

ముందు చక్రం పట్టుకుని చూశాడు.

అది పూర్తిగా వంకరపోయి నేల మీదకి వాలిపోయింది.

ఇక రిక్షా ఇప్పుడు ప్రయాణానికి పనికిరాదు.

చంద్రిగాడికి నోట మాట పెకిలిరాలేదు.

దుఃఖంతో కన్నీళ్ళు కారుతున్నాయి.

కన్నీళ్ళు చెమట ధారల్లో కలిసిపోయాయి.

ఏమైంది అంటూ జనం గుమిగూడారు.

రిక్షావాళ్ళకి ఒళ్ళు పోగరెక్కిందన్నారు.

అసలు తిండి ఎక్కువై కళ్ళు కనపడటం లేదన్నారు.

అంతేకాక అసలు జంటనగరాలలో రిక్షాలను నిషేధించాలన్నారు.

ఇంకా అనేకం అన్నారు.

ఇంతలో ఆ ఇద్దరు యువకులలో ఒకడు ముందుకువచ్చి, చంద్రిగాడి షర్టు గొంతు దగ్గర మెలేసి పట్టుకుని, వెనక్కీ ముందుకు వూపుతూ— "దొంగ లం—కొడుకా! మా రోజులు బాగుండిపోయాయి కాబట్టి మేము బ్రతికిపోయాం. అదే ఏ లారీకో గుద్దించి వుంటే ఈ పాటికి చచ్చేవాళ్ళం." అంటూ బండబూతులు తిడుతూ, దయదలచి తన్నకుండా వదిలి పెడుతున్నట్టు, ఒక్కతోపు తోసి, డబ్బులివ్వకుండా వెళ్ళిపోయారు.

చంద్రిగాడు ఆ తోపుకి వెళ్ళి రిక్షా ముందుచక్రంమీద పడ్డాడు. హేండిల్

జార్ చంద్రిగాడి డొక్కలో గుచ్చుకుని, "అమ్మా" అంటూ అరిచాడు.

ఆ అరుపు చంద్రిగాడి తల్లికి విన పడిందో లేదో కానీ, దారిన పోతున్న పోలీసు కానిస్టేబులుకి మాత్రం విన పడింది.

విజిల్ వూదుకుంటూ పరుగెత్తు కొచ్చాడు.

గుంపునంతా చెదరగొట్టాడు.

అప్పటికి రెండు వైపులనుంచి "జామ్" అయిపోయిన ట్రాఫిక్ క్లియర్ చేసాడు.

అంతా వెళ్ళిపోయిన తరువాత కానిస్టేబుల్ చంద్రిగాడిని చేరుకున్నాడు.

తనని లేవదీసి హాస్పిటలుకి పంపించు తాడని చంద్రిగాడు వూహించాడు.

తను హాస్పిటలుకి వెళ్తే రిక్షా రోడ్డు మీద మిగిలిపోతుంది. తాను తిరిగి మాములు మనిషి అయ్యేవరకూ రిక్షాని పోలీసు స్టేషనులో జాగ్రత్తపరచమని చెప్పాలి.

తను ఆపదలో ఇరుకున్నట్టు తన రిక్షా యుజమానికి తెలియచేయమని, పోలీసుని అడగాలనుకున్నాడు.

కానీ చంద్రిగాడు అనుకున్నట్టుగా పోలీసు కానిస్టేబులు ఏదీ చెయ్యలేదు.

కనీసం సానుభూతి అయినా చూప లేదు.

పైగా ట్రాఫిక్ న్యూసెన్సు కేసు బుక్‌చేస్తానన్నాడు.

జైల్లో వేయిస్తానన్నాడు.

అయితే—

చంద్రిగాడు తన తప్పేమీ లేదన్నాడు.

ఓపికున్నంత వరకూ ప్రతిమి లాడాడు.

కానీ పోలీసు ఏదీ వినిపించుకోలేదు.

పైగా—

పోలీసు స్టేషనుకు నడవమన్నాడు.

లేదా—

జేబులో డబ్బులు తియ్యమన్నాడు.

చంద్రిగాడి జవాబుకోసం ఎదురు చూడకుండానే వాడి జేబులో డబ్బులు లాక్కుని పొమ్మన్నాడు.

చంద్రిగాడు నిస్సయంగా లేచాడు.

లేచి రిక్షా ముందుచక్రం పైకెత్తి రిక్షాని ఈడ్చుకుంటూ బయలుదేరాడు. దాన్ని రిపేరు చేయించటానికి డబ్బు ఎలాగూ లేదు. అలాగే తీసుకువెళ్ళి దాన్ని యజమానికి అందచేయ్యాలి.

చంద్రిగాడు రెండడుగులు వేసాడు.

కానీ కళ్ళుతిరిగి రోడ్డుమీద పడి పోయాడు.

ప్రక్కన రిక్షా పడిపోయింది.

రోడ్డుమీద వాహనాలు మామూలు గానే పోతున్నాయి.

కాదంటే, చంద్రిగాడిని తప్పించుకుని పోతున్నాయి.

జనం చూడకుండానే పోతున్నారు.

చంద్రిగాడు బ్రతికే వున్నాడో లేక చనిపోయాడో చంద్రిగాడికే తెలియాలి.

——